సాక్షి జగిత్యాల

శుక్రవారం । 19 । మే । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 38 కోడెలు, 2 ఆవులను పోచంపల్లికి చెందిన మహేశ్వరీ గోశాల, పెద్దబనగారం శివపత్రి గోశాలకు అందించారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం రాత్రి మహాలింగార్చన వైభవంగా జరిగింది. అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దమ్మన్నపేటలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో జైనా పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వరి ధాన్యం కొనుగోళ్లు గురువారంతో ముగిశాయని పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్ తెలిపారు. మొత్తం 15,984 క్వింటాళ్ల ధాన్యం కొని మిల్లులకు పంపించామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు విజయవంతంగా ముగించామన్నారు. కొనుగోళ్లు పూర్తి చేసిన దమ్మన్నపేట మొదటి గ్రామంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన కేంద్రం నిర్వాహకుడు జక్కుల తిరుపతి, డైరెక్టర్ గంగమల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల తయారీకి పరిశోధనస్థానం పెద్దపీట



సదస్సులో సమస్యలు వివరిస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పరిశోధనస్థానాల్లో తయారుచేసిన విత్తనాలకు పెద్దపీట వేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు వరిసాగుపై గురువారం పరిశోధన స్థానంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు తయారు చేస్తున్న విత్తనాలకు రైతుల నుంచి మంచి ఆదరణ వస్తుందన్నారు. ప్రైవేటు కంపెనీల విత్తనాలతో పోలిస్తే పరిశోధనస్థానం విత్తనాలతో అధిక దిగుబడులు సాధ్యమన్నారు. పొలాస పరిశోధన స్థానం నుంచే 11 రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్‌సిద్ది, డాక్టర్ లక్ష్మీప్రసన్న వరిసాగులో అధిక దిగుబడులకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి ఫొటో ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అలాగే అన్నం నాణ్యత బాగా ఉండి చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వరి రకాలను విడుదల చేయాల్సిందిగా శాస్త్రవేత్తలను రైతులు కోరారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు పూడూరు రాంరెడ్డి, కాసు మల్లారెడ్డి, జితేందర్‌రావు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక జేఏసీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులు

వెల్గటూర్(ధర్మపురి): మండలంలోని పాశిగామ శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా గ్రామస్తులు గురువారం ఉమ్మడి కార్యాచరణ కమిటీ(జేఏసీ) ఏర్పాటు చేశారు. కమిటీకి అధ్యక్షుడిగా కొత్తూరి భూమయ్య, గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్, ఎంపీటీసీలు బొప్పు తిరుపతి, పొడేటి సతీశ్, ఉపాధ్యక్షులుగా కంటెం తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఎంబడి శ్రీధర్, సహాయ కార్యదర్శి కాంద్రపు మహేశ్, ప్రచార కార్యదర్శి కంటెం మధు, కోశాధికారిగా ఎంబడి చినరాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం నిలుపుదల చేయడానికి తీసుకోవలసిన నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి గ్రామస్తులతో చర్చించి ముందుకెళ్లడానికి ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు.

జాతీయ ఉపకార వేతనాలకు మోడల్‌స్కూల్ విద్యార్థి



శశిధర్‌గౌడ్

కథలాపూర్(వేములవాడ): జాతీయ ఉపకార వేతనాలకు కథలాపూర్ మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఉత్కం శశిధర్‌గౌడ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ గురువారం తెలిపారు. భూషణరావుపేట గ్రామానికి చెందిన శశిధర్‌గౌడ్ ప్రతిభ చాటి ఉపకార వేతనాలకు ఎంపికయ్యాడు. అతడికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యేవరకు ఉపకార వేతనాలు అందుతాయి.

మిల్లర్లకు అమ్ముకుంటున్రు



ఈ రైతు పేరు మర్రిపల్లి లస్మయ్య. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామం. గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 20 రోజుల క్రితం ధాన్యం పోశాడు. అయినా నిర్వాహకులు కొనుగోలు చేయ లేదు. దీంతో చేసేదేమీలేక రెండు రోజుల క్రితం 126 క్వింటాళ్ల ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.1,800 చొప్పున నేరుగా రైస్‌మిల్లర్‌కు అమ్ముకున్నాడు. ఇలా ఈ ఒక్క రైతే కాదు.. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో చాలా మంది రైతులు నేరుగా మిల్లర్లకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

- కొనుగోళ్లలో జాప్యంతో మిల్లులకు తరలిస్తున్న రైతులు
- సకాలంలో రాని లారీలు
- ధాన్యం దింపుకోని మిల్లర్లు
- బస్తాకు రూ.2 వసూలు చేస్తున్న లారీ డ్రైవర్లు



మిల్లర్లకు రైతులు ధాన్యం విక్రయించడంపై పొరండ్ల ఐకేపీ కేంద్రంలో విచారణ చేస్తున్న డీఎం రజినీకాంత్

జగిత్యాలరూరల్: ఓవైపు లారీల కొరత.. కొనుగోళ్లలో జాప్యంతో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కల్లాలకు ధాన్యం తెచ్చి నెల రోజులు గడిచినా తూకం వేయకపోవడం, ఏదో విధంగా తూకం వేసినా వెంటనే లారీలు రాకపోవడంతో కల్లాల్లోనే పడిగాపులుగాస్తున్నారు. మరోవైపు లారీల్లో ఎగుమతి చేసిన ధాన్యాన్ని మిల్లుల్లోనూ వెంటనే దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతుండడంతో ఆవేదన చెందుతున్నారు.

కొనుగోళ్లు ఇలా..

జిల్లాలో మొత్తం 416 కొనుగోలు కేంద్రాల ద్వారా 24,087 మంది రైతుల నుంచి 1,83,682 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని సేకరించారు. ఇంకా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాల్లోనే పేరుకుపోయింది. దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు గాస్తున్నారు.

లారీలు రావడం లేదు



ధాన్యం కాంటా వేసిన తర్వాత లారీలను డబ్బు ఇచ్చి తెచ్చుకోవాల్సి వస్తోంది. లేకుంటే బస్తాలను లోడింగ్ చేయడం లేదు. మిల్లుల్లో తాలు పేరిట కోతలు పెట్టడంతో రెండు విధాలుగా ఇబ్బందులు తప్పడం లేదు.

– పొగ్గళ్ల మధు, రైతు, పొరండ్ల

చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చర్యలు చేపడుతున్నాం. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు ఏర్పాటు చేశాం. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నాం.

– రజినీకాంత్, డీఎం, సివిల్‌సప్లై, జగిత్యాల

లారీలు తెప్పించడంలో విఫలం

ఈ సీజన్‌లో జిల్లాలో ధాన్యం దిగుబడి 5.5 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు అంచనా వేసినా.. అకాల వర్షాలు, ఈదురుగాలులతో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసినా దానికి అనుగుణంగా లారీలు తెప్పించడంలో విఫలమయ్యారు. జిల్లా పరిధిలో ఎక్కడ చూసినా లారీల కొరతే. ఒక్కో మండలంలో 30 లారీల వరకు రోజూ రావాల్సి ఉన్నా పది కూడా రావడం లేదు. ఈనేపథ్యంలో రైతులు ఆందోళనకు దిగుతుండటంతో అదనపు కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు రోజూ కేంద్రాలకు వెళ్లి ధాన్యం తరలింపు వేగవంతం చేయించాల్సి వస్తోంది.

ఆలస్యంగా తరలింపు

ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యం కొన్న వెంటనే లారీలు రాకపోవడంతో మిల్లులకు తరలింపు ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే మిల్లర్లు కూడా ధాన్యం రంగు మారిందనో, తాలు ఉందనో, వడ్లు తడిశాయనో, తూకంలో వ్యత్యాసం ఉందని ఏదో ఒక కొర్రీ పెడుతూ దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో రెండుమూడు రోజుల పాటు లారీలు మిల్లుల వద్దే ఉండాల్సి వస్తోంది. దీంతో ధాన్యం ఎగుమతిలో జాప్యం అవుతోంది. అధికారులు ఒక ప్రాంతానికి వెళ్లి మిల్లుల్లో తనిఖీలు చేస్తూ అన్‌లోడింగ్ చేయిస్తుంటే మరో ప్రాంతంలో మిల్లర్లు కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తున్నారు. అయితే, ధాన్యం అమ్ముకోవడం ఒక సమస్య అయితే అమ్మిన ధాన్యాన్ని మిల్లుకు తరలించడం రైతులకు మరో తలనొప్పిగా మారింది. జిల్లాలో అనేక చోట్ల కాంట్రాక్టర్ ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదంటూ లారీ డ్రైవర్లు బస్తాకు రూ.2 చొప్పున అంతకంటే ఎక్కువ ఇస్తేనే రవాణా చేస్తామని మొండికేస్తున్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై విచారణ

జగిత్యాలరూరల్: వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు చేపడుతామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రజినీకాంత్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల ఐకేపీ కొనుగోలు కేంద్రంలో మిల్లర్లకు రైతులు ధాన్యం విక్రయించడంపై విచారణ చేపట్టారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని చూసి కొనుగోళ్లు వేగవంతం చేసేలా పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నవీన్, ఏపీఎం గంగాధర్ ఉన్నారు.

బ్రాయిలర్ కోళ్ల పెంపకంపై అవగాహన



అవగాహన సదస్సులో ప్రొఫెసర్లు

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు వెటర్నరి విశ్వవిద్యాలయంలో పశువైద్య కళాశాల, భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఢిల్లీ ఆధ్వర్యంలో గురువారం బ్రాయిలర్ కోళ్ల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ మాధవరావు మాట్లాడుతూ, దేశంలో 142 కోట్ల జనాభాలో 70 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగమైన బ్రాయిలర్ కోళ్ల పెంపకంలో లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం అందిస్తే తక్కువ కాలంలో ఎక్కువ బరువున్న కోళ్లను పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దైవకృష్ణ, రాంబాబు, శ్రీదేవి, లక్ష్మి, వినయశ్రీ, రైతులు పాల్గొన్నారు.

బుద్దేశ్‌పల్లి @ 44.5 డిగ్రీలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగైదు రోజులుగా గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ధాటికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు వడగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. జిల్లాలో గురువారం గరిష్ట ఉష్ణోగ్రతలు 44.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉండగా, కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 33.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు..

ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లి	44.5
వెల్గటూర్	44.3
సారంగాపూర్	44.2
ఎండపల్లి మండలం గుల్లకోట	44.2
ధర్మపురి మండలం జైన	44.2
వెల్గటూర్ మండలం ఎండపల్లి	44.0
పెగడపల్లి	43.9
బీర్‌పూర్ మండలం కొల్వాయి	43.9
ధర్మపురి మండలం నేరెల్ల	43.5
బుగ్గారం మండలం సిరికొండ	43.1

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణపై అన్ని స్థాయిల అధికారులు దృష్టి సారించాలని, ప్రతి ఠాణాలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు సమర్థవంతమైన సేవలందించేలా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100 ఫిర్యాదులపై రెస్పాన్స్, క్లోజింగ్ సమయం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై కొత్తగా రౌడీషీట్ తెరవాలన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని ఏ రకంగా పరిష్కరించాలనే విషయంలో గ్రామ పోలీసు అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయడం ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై మరింత నమ్మకం, గౌరవం పెరుగుతుందన్నారు. వీపీవోలు ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడిచేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, ఎస్పీ, డీసీఆర్బీ సీఐలు రాజశేఖర్‌రాజు, సరిలాల్, శ్రీనివాస్, సీఐలు రాంచందర్‌రావు, లక్ష్మీనారాయణ, ఆరీఫ్ అలీఖాన్, కోటేశ్వర్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

హంపి పీఠాధిపతికి పూర్ణకుంభ స్వాగతం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం రాత్రి హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విరూపాక్ష విద్యారణ్య స్వామి దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన, అనుబంధ ఆలయాల్లో వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో స్వామివారి శేష వస్త్రం, ప్రసాదంలు, ఫొటో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, అర్చకులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



మురికికాల్వను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


పెగడపల్లి(ధర్మపురి): వర్షాకాలానికి ముందే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ మంద మకరంద పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని బతికపల్లిలో పర్యటించారు. గ్రామంలో మురికి కాల్వలను పరిశీలించి, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మురికి కాల్వలో చెత్త చెదారం పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణాలు, కిచెన్ గార్డెన్లు లాంటి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుధ్యంపై అధికారులు, సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ శోభారాణి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, ఏపీవో వేణు, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత ఉన్నారు.

ముందస్తు శానిటేషన్ డ్రైవ్ పనులు చేపట్టాలి

గొల్లపల్లి(ధర్మపురి): గ్రామాల్లో ముందస్తుగా వారం రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ మకరంద్ అన్నారు. మండలంలోని వెంగళాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పనులను పరిశీలించారు. గ్రామాల్లో రోజూ రోడ్లను శుభ్రపర్చాలని, గుంతల్లో నీరు నిల్వ లేకుండా పూడ్చివేయాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్టాప్‌లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇల్లు శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నవీన్‌కుమార్, సర్పంచులు, ఉపసర్పంచులు ఉన్నారు.

వడివడిగా భూసేకరణ

- ఎన్‌హెచ్ 563 ప్రక్రియ వేగవంతం
- వరంగల్– కరీంనగర్ సెక్షన్‌లో భూసేకరణ దాదాపు పూర్తి
- ఇంకా కొన్ని చోట్ల తొలగని భూ వివాదాలు
- న్యాయం చేయాలంటున్న నిర్వాసితులు
- జగిత్యాల – వరంగల్ మధ్య త్వరలో పనులు ప్రారంభం



ఎన్‌హెచ్ 563 రూట్‌మ్యాప్



ఎన్‌హెచ్ 563 చిత్రం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:జగిత్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల మధ్య నిర్మించనున్న జాతీయరహదారి–563 భూసేకరణ వేగవంతం చేశారు. కరీంనగర్–వరంగల్ సెక్షన్‌లో ఈ ప్రక్రియ ముగింపునకు వచ్చింది. పనులు వేగవంతం చేయాలని తాజాగా కలెక్టర్ కర్ణన్ ఆర్డీవోలను ఆదేశించారు. ఈ జాతీయ రహదారి కోసం కరీంనగర్ జిల్లాలో 258.67హెక్టార్ల భూమి అవసరం. కొంతకాలంగా జిల్లాలోని కేశవపట్నం, మానకొండూరు, కొత్తపల్లి మండలాల్లో పలువురు రైతులు, నిర్వాసితులు తమ భూమి పరిహారం కోసం న్యాయపోరాటం చేస్తున్నారు.

మిగిలింది రెండు హెక్టార్లు మాత్రమే

ఎన్‌హెచ్ 563 మొత్తం 248.83 కిలోమీటర్లు. దీన్ని కరీంనగర్– వరంగల్, కరీంనగర్– జగిత్యాల సెక్షన్లుగా విభజించి భూసేకరణ చేపట్టారు. జగిత్యాల, వరంగల్, మరిపెడ, ఖమ్మం సమీపంలో జంక్షన్లు నిర్మించనున్నారు. కరీంనగర్ – వరంగల్ సెక్షన్‌లో మొత్తం 258.67 హెక్టార్ల భూసేకరణ ప్రారంభించారు. ఇందుకోసం భూ సేకరణ ప్రక్రియను 3ఏ, 3జీ, 3డీ–లుగా విభజించారు. 3 హెచ్‌లో మాత్రం ఇంకా 2.21 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఆ వెంటనే పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

అనూహ్యంగా పెరిగిన అంచనా

జగిత్యాల– కరీంనగర్ సెక్షన్‌లో కరీంనగర్ బస్టాండు నుంచి కోర్టు చౌరస్తా, రేకుర్తి కొత్తపల్లి మీదుగా వెళ్లే దారిలో కొన్ని మార్పులు జరిగాయి. మానకొండూరు మీదుగా ఇరుకుల్ల వాగు జూబ్లీనగర్, ఎలబోతారం, రుక్మాపూర్ మీదుగా రోడ్డు కొత్తపల్లిలో కలువనుంది. ఈ రహదారి వెంట 11 బ్రిడ్జిలు నిర్మించనున్నారు. మొత్తం 68 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు నిర్మాణానికి గతేడాది దాదాపు రూ.1491 కోట్లు ఖరారయ్యాయి. ఈ అంచనా వ్యయం తాజాగా రూ.2,146 కోట్లుకు చేరుకుందని సమాచారం. అంటే దాదాపు రూ.655 కోట్లు అంచనా వ్యయం పెరిగింది. ఇటీవల జగిత్యాల– కరీంనగర్ సెక్షన్‌లో జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు 58 కిలోమీటర్ల వరకు రూ.1503.866 కోట్ల వ్యయం నిర్ధారిస్తూ.. ఈ ఏడాది సెప్టెంబరులో అంచనావ్యయానికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి

పరిహారం కోసం పోరాటం

రహదారి నిర్మాణంలో సేకరించాల్సిన భూమిలో కొందరు రైతులు, భూమిని కోల్పోతున్న వారు పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సరిపోదని, మార్కెట్ రేటుకు తగినట్టుగా ఇవ్వాలని పట్టుబట్టుతున్నారు. ఇంటి స్థలాలకు, పంటభూములకు చెల్లించే పరిహారంలో వ్యక్తులను బట్టి చెల్లిస్తున్నారని,పలుకుబడి ఉన్నవారికి ఒకలా, లేని వారికి మరోలా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు, భూ నిర్వాసితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ కర్ణన్ ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తీవ్రంగా నష్టపోతున్న



నాకు అన్నారం శివారులో వ్యవసాయభూమి ఉంది. అందులో నుంచి నేషనల్ హైవే 563 రోడ్డు వెళ్తుంది. నాకున్న 2.21 ఎకరాలు రోడ్డులో పూర్తిగా కోల్పోవాల్సి వస్తోంది. మార్కెట్లో గుంటకు పది లక్షలు ధర పలుకుతోంది. అధికారులు గుంటకు రూ.42,000 చెలిస్తామంటున్నారు. మొత్తం భూమిని కోల్పోవడం బాధ కలిగిస్తుండగా, పరిహారం కూడా తక్కువగా చెల్లిస్తున్నారు. కరీంనగర్ పట్టణానికి అనుకొని ఉన్న భూములకు ఇంత తక్కువ ధర చెల్లించడం అన్యాయం.

– గోగూరి రాజు, రైతు, ముంజంపల్లి

బాధలు వర్ణణాతీతం



నేషనల్ హైవే 563 కింద మూడు గుంటల ఇల్లు, ఇంటిఅడుగు స్థలం కోల్పోతున్నా. అధికారులు వ్యవసాయ భూమి కింద రాసుకొని పోయి, గుంటకు రూ.83వేలు చెల్లిస్తున్నారు. ఇంటిని పరిహారం జాబితాలో నమోదు చేయలేదు. అధికారుల తప్పిదంతో నాకు నష్టం జరుగుతుంది. రహదారిని ఆనుకుని ఉన్న భూమికి బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.10 లక్షల నుంచి రూ.12లక్షలు పలుకుతుంటే.. గుంటకు రూ.83 వేలు చెల్లించడం అన్యాయం.

– ఆకుల సదానందరావు, గట్టుదుద్దెనపల్లి

క్లుప్తంగా

మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రావణి, నాయకులు

జగిత్యాలరూరల్: రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కయిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, బీజేపీ నియోజకవర్గ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోళ్ల జాప్యం చేసి రైతులను వేధిస్తుందని, వారిని ఆదుకోవాల్సింది పోయి నిండా ముంచుతున్నారన్నారు. కటింగ్‌ల పేరుతో దోచుకుంటున్నారని, రైతులను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నీటిమూటలే అయ్యాయయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, నాయకులు నరేశ్, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారం శివారులో గంజాయి విక్రయిస్తూ.. సేవిస్తున్న యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. నాగారం శివారులో వడిచెర్ల జాన్‌ప్రతాప్‌రెడ్డి(నాంపెల్లి), జడల నాగరాజు(నాంపెల్లి) గంజాయిని విక్రయిస్తున్నారని, గుడిసె చరణ్ (మారుపాక), గడప సాగర్ (నాగారం), వడ్లూరి వెంకటేశ్(సుద్దాల), ఓ మైనర్ బాలుడు (వట్టిమల్ల) గంజాయిని సేవిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి 125 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్లు, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఐదుగురిలో జాన్‌ప్రతాప్‌రెడ్డి పరారీలో ఉండగా మిగతా నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఎస్సై రమాకాంత్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): తనను వేధిస్తూ.. ఇంట్లోని వస్తువులు దహనం చేశాడని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో భర్తపై గురువారం కేసు నమోదు చేశారు. జమ్మికుంట పట్టణ సీఐ బార్పటి రమేశ్ వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కేశవపూర్ గ్రామానికి చెందిన కర్నె వెంకటేశ్, జ్యోతికి 13ఏళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా వెంకటేశ్ మద్యం తాగివచ్చి భార్య జ్యోతితో గొడవపడుతున్నాడు. ఇటీవల దళితబంధు పథకం ద్వారా కారు తీసుకున్నారు. అయితే మద్యానికి బానిసైన వెంకటేశ్ కారును ఎవరికైనా అమ్ముతాడనే భయంతో జ్యోతి తన తమ్ముడు రాజుకుమార్ వద్ద వాహనం ఉంచింది. మూడు నెలలుగా తాగి వస్తున్న వెంకటేశ్ కారు, అదనపు కట్నం తీసుకురావాలని, లేనిపక్షంలో చంపుతానని, ఇంటిని కాల్చివేస్తానని జ్యోతితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో జ్యోతి వేధింపులు భరించలేక గురువారం గోదావరిఖనిలోని తన తమ్ముడి ఇంటికి వెళ్లిపోయింది. ఆవేశానికి గురైన వెంకటేశ్ తమ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులకు నిప్పు ంటించాడు. సమాచారం అందుకున్న జ్యోతి ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లుమొత్తం దహనమైంది. దీంతో జ్యోతి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మార్కెట్లో నకిలీల బెడద
- ఎరువులు, విత్తనాలపై అవగాహన అవసరం



మల్లాపూర్ మండలంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పోలీస్, వ్యవసాయ అధికారులు (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): జిల్లా వ్యాప్తంగా రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. అయితే మార్కెట్‌లో నకిలీల బెడద ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా లేకుంటే మోసపోయే ప్రమాదం ఉంటుంది. అధిక లాభాల కోసం విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులు నకిలీవి అంటగట్టే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విత్తన కొనుగోళ్లలో పాటించాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విక్రయదారు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలు చదవాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు దాచి పెట్టుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటేనే విత్తనాలుగా వాడుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనేముందు..

- డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడి, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్యపదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగుల మందుల విషయంలో..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందులు కొనాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగుమందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండుమూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

అధికారుల సూచనలు పాటించాలి



వానాకాలం పంటల సాగుకు వినియోగించే విత్తనాలు, ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికా రుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. – పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పాపం చిన్నారి

- పుట్టుకతోనే గుండెకు రంధ్రం
- వాంతులు, విరేచనాలతో బాత్‌రూంకు వెళ్తూ మృతి



అల్ఫియా ఐమాన్ (ఫైల్)

ధర్మపురి: పుట్టుకతోనే ఆపాప గుండెకు రంధ్రం పడింది. అయినా కూతురును బతికించుకోవాలని వైద్యం కోసం తల్లిదండ్రులు ఉన్నదంతా ఊడ్చి పెట్టి అప్పు చేసి వైద్యం చేయించారు. అయినా ఆ బాలిక మృతిచెందిన ఘటన ధర్మపురిలో జరిగింది. బంధువుల వివరాల ప్రకారం.. ధర్మపురిలోని ఫతేనగర్‌కు చెందిన మహ్మద్ చాంద్‌పాషా, ఆయోష ఫర్జిన్ దంపతులకు కూతురు, కుమారుడు. కూతురు అల్ఫియా ఐమాన్ (11)కు పుట్టుకతోనే గుండెకు రంధ్రం పడింది. వైద్యం కోసం ఉన్నదంతా ఊడ్చి పెట్టారు. కొంత అప్పు చేసి వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.5 లక్షలకు పైగా ఖర్చయింది. అయినా ఫలితం లేకుండాపోయింది.

అనారోగ్యమా లేదా వడదెబ్బా..?

గురువారం వేకువజామున బాలిక కడుపులో నొప్పంటూ వాంతులు, విరేచనాలు చేసుకుంటూ బాతురూంకు వెళ్తుండగా కుప్పకూలిపోయింది. తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా బాలిక మృతికి కారణం అనారోగ్యమా లేదా వడదెబ్బ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్యాల(చొప్పదండి): ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టిన వలసజీవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ దుబాయ్‌లో మృతిచెందగా మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తుల వివరాలు.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన లింగాల ముత్తయ్య(55) ఇరవై ఏళ్లుగా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. దుబాయ్‌లోని ఆల్ జబర్ ఎనర్జీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ కంపెనీలో గార్డెన్ వర్క్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. 15 రోజుల క్రితం విధులకు వెళ్లి, తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ చాంద్‌పాషా అక్కడి భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి చికిత్స అందించేందుకు కృషి చేశారు. కాగా ముత్తయ్య ఈ నెల 14న మృతిచెందగా, అక్కడి కంపెనీ యాజమాన్యం సహకారంతో మృతదేహాన్ని చాంద్‌పాషా స్వగ్రామానికి చేర్చారు. ఉపాధి కోసం వెళ్లి శవపేటికలో వచ్చిన ముత్తయ్య మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు హృదయ విదారకంగా రోదించారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

కోరుట్ల: కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ క్విజ్ పోటీలు విజయవంతం చేసేలా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారని వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ

- ఉపాధ్యాయులపై వేటు పడే అవకాశం
- రిలీజ్ ఆర్డర్ ఇవ్వలేదన్న చీఫ్ సూపరింటెండెంట్

జగిత్యాల: ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులు పర్యవేక్షకులుగా వెళ్లగా.. ఇందులో కొందరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించకుండానే మళ్లీ పాఠశాలలో జాయిన్ అయి సీఎల్స్ వేసుకోకుండా ఆ నెలకు సంబంధించిన జీతాలను ఎత్తారు. ఈ విషయంపై ‘సాక్షి’లో ఈనెల 13న ‘ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు’ అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఇన్విజిలేషన్‌కు వెళ్లిన 10 మంది ఉపాధ్యాయులు వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆదేశించారు. వారు ఈనెల 15న ఇంటర్మీడియెట్ పర్యవేక్షకులుగా పనిచేసినట్లు రిలీజ్ ఆర్డర్ ఉపాధ్యాయులు హెచ్ఎంలకు, హెచ్ఎంలు ఎంఈవోలకు అందజేశారు. ఇక్కడే తిరకాసు మొదలైంది. ఇందులో ఒక ఉపాధ్యాయురాలు మొత్తానికే విధులకు వెళ్లకుండానే వెళ్లినట్లు ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి ఎంఈవోకు అందజేశారు. ఇంకొందరు ఉపాధ్యాయులు ఒకటి రెండు రోజులు అబ్‌సెంట్ ఉన్నట్లు రిలీజ్ ఆర్డర్ అందజేశారు. కాగా, గురువారం ‘సాక్షి’లో ‘ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్’ వార్త ప్రచురితం కావడంతో జిల్లా విద్యాధికారి దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. సారంగాపూర్ మండల విద్యాధికారితో పూర్తి వివరాలు తీసుకున్నట్లు తెలిసింది. అసలు సదరు ఉపాధ్యాయులు పాఠశాల నుంచి ఎప్పుడు రిలీవ్ అయ్యారు, ఎప్పుడు జాయిన్ అయ్యారు, డ్యూటీ సర్టిఫికెట్లు తప్పుగా ఎందుకు ఇచ్చారన్న దానిపై విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అప్పుడు చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వారిని సైతం రిలీజ్ ఆర్డర్ ఎలా ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఆ ఉపాధ్యాయురాలు పూర్తిగా అబ్‌సెంట్ కాగా, మరో ఇద్దరు ఒక్కో రోజు అబ్‌సెంట్ అయినట్లు రిలీజ్ ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని, వారు మండల విద్యాధికారులకు అందజేసినవి, తాము ఇచ్చినవి కావని, వాటికి తమకు ఎలాంటి సంబంధం లేదని అప్పటి చీఫ్ సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. దీంతో అవి పూర్తిగా ఫేక్ సర్టిఫికెట్లని తేలింది. దీనిపై విద్యాధికారి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఉపాధ్యాయులపై వేటు పడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అర్ధరాత్రి క్షుద్రపూజలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మోతె శ్మశానవాటికలో అర్ధరాత్రి ఓ వ్యక్తి నగ్నంగా క్షుద్రపూజలు చేయడం కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి నగ్నంగా శ్మశానవాటికలోని మృతదేహాలను దహనం చేసిన బూడిద తీసుకుని శరీరంపై చల్లుకుంటూ హరహర మహాదేవ శంభోశంకర అంటూ అరుస్తూ పూజలు చేశాడు. స్థానికులు గమనించి బెదిరించడంతో జంబిగద్దె మీదుగా తహసీల్ చౌరస్తా వైపు పరుగులు పె ట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు జంకుతున్నారు. అసలు పూజలు చేసిన వ్యక్తి ఎవరు, నగ్నంగా ఎందుకు చేశాడనే విషయం అంతుపట్టడం లేదు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

రుద్రంగి(వేములవాడ): మండలంలోని మానాల గ్రామానికి చెందిన పెద్దగుట్ట(బడాపహాడ్) దర్శనానికి వెళ్తూ ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వృద్ధురాలు సిరికొండ రామవ్వ(75) గురువారం మృతిచెందింది. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం చందూర్ శివారులో డీసీఎం వ్యాన్ బోల్తాపడి రామవ్వ గాయపడ్డ విషయం తెలిసిందే. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామవ్వ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డిజిటల్ ఇంకెప్పుడు..?

- బల్దియాల్లో ఇళ్లకు డిజిటల్ నంబర్ల కేటాయింపునకు..
- ఏడాది కిత్రం ప్రభుత్వం నిర్ణయం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికి డిజిటల్ నంబర్లు వేయాలని, బై నంబర్లకు స్వస్తి పలకాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు జారీ చేసి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు సదరు ప్రక్రియ చేపట్టలేదు. బేస్‌మ్యాప్ ఆధారంగా డిజిటల్ సర్వే చేపట్టాలని ఆదేశాలున్నప్పటికీ అవి బుట్టదాఖలైపోయాయి.

జిల్లాలో..

ప్రస్తుతం జిల్లాలోని మున్సిపాల్టీల్లో అత్యధికంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ఇళ్ల నంబర్లు అస్తవ్యస్తంగా మారాయి. అడ్రస్‌లు దొరకడం సైతం కష్టతరంగా మారింది. పట్టణ ప్రగతిలో భాగంగా సుమారు 10 పనులను అమలు చేయాలని అప్పట్లో ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో క్రీడా ప్రాంగణాలు, నర్సరీలతో పాటు డిజిటల్ ఇళ్ల నంబర్లను సైతం వేయాల్సి ఉంది. డిజిటల్ నంబర్లు వేసి గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మున్సిపల్ చైర్మన్లతో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించి ప్రతి ఇంటికి డిజిటల్ నంబర్లు వేయాలని ఆదేశించారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉండగా, డిజిటల్ నంబర్ల ప్రక్రియ ఇప్పటి వరకు ఏ మున్సిపాలిటీలోనూ మొదలు కాలేదు.

బై నంబర్లతో ఇబ్బందులు

జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ఇళ్లు అధికంగా నిర్మించడం, శివారు ప్రాంతాలు సైతం పెరగడం, ఇటీవల కొన్ని గ్రామాలు విలీనం కావడంతో అత్యధికంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక ఇంటికి ఒక సీరియల్ నంబర్లు కేటాయించగా మరో ఇంటికి సైతం మరో సీరియల్ నంబరుకు బై నంబర్లు వేస్తున్నారు. దీంతో నంబర్లన్నీ అస్తవ్యస్తంగా మారడంతో పాటు అడ్రస్ సైతం సక్రమంగా తెలియకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఒక్కో ఇంటి నంబరు /ఏ, /బీ అని అనేకంగా ఉండటం మున్సిపల్ అధికారులు ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలు చేయడం ఇబ్బందికరంగ మారింది. కాగా డిజిటల్ నంబర్ల ప్రక్రియ మొదలు పెట్టడంలో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అయితే కొన్ని చోట్ల ట్రయల్ రన్ చేసిన అనంతరం అన్ని మున్సిపాలిటీల్లో చేస్తామన్నప్పటికీ ఇప్పటి వరకు వీటి ఊసే ఎత్తడం లేదు.

గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం

అడ్రస్‌లు వెతికేటప్పుడు ఇబ్బందులు లేకుండా తేలికగా ఉండేందుకు ప్రతి ఇంటికి డిజిటల్ నంబర్లు వేసి గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించారు. డిజిటల్ నంబర్ ఉంటే మొబైల్‌లో గూగుల్ మ్యాప్ ఓపెన్ చేసి అడ్రస్ ఎంటర్ చేస్తే ఇబ్బంది లేకుండా సదరు ఇంటికి వెళ్లవచ్చు. ఇది అమలులోకి వస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి ఇంటికి ఇంగ్లిష్ అక్షరాలతో పాటు నంబర్లతో కూడిన డిజిటల్ ప్లేట్లు ఇవ్వనున్నారు. కాలనీ పేరు సైతం ఉంటుంది. ఇంటి నంబరుకు సంబంధించిన దానిని ఇంటర్నెట్‌లో సైతం తెలుసుకునే అవకాశం ఉంటుంది. గూగుల్ మ్యాప్ ద్వారా సులభంగా అడ్రస్ దొరికే అవకాశం ఉంటుంది. అలాగే డిజిటల్ నంబర్లతో పాటు క్యూఆర్ కోడ్‌ను అనుసంధానించే అవకాశాలు సైతం ఉన్నాయి.

జిల్లాలోని మున్సిపాల్టీలు, ఇళ్ల వివరాలు

మున్సిపాలిటీ	ఇళ్లు
జగిత్యాల	30,000
కోరుట్ల	21,000
మెట్‌పల్లి	17,000
రాయికల్	4,680
ధర్మపురి	3,000

గైడ్‌లైన్స్ ప్రకారం చేపడతాం



డిజిటల్ నంబర్లలో కొన్ని ఇబ్బందులున్నాయి. కొన్ని చోట్ల ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. అది పూర్తికాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం. అపార్ట్‌మెంట్లకు సంబంధించి కొన్ని ఇబ్బందులున్నాయి. అనంతరం మున్సిపల్‌లో చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల


అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటస్వామి(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం చెందిన పసునూరి వెంకటస్వామి(53) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మొగిలిపేట శివారులో గురువారం జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వెంకటస్వామి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. రెండురోజుల క్రితం మొగిలిపేటలోని తన పెద్దకుమార్తె ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం గ్రామశివారులోని భీమన్నగుడి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో యువకుడు మృతి



సతీశ్(ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన కల్లెడ సతీశ్ (26) గురువారం వేకువజామున మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాలు.. సతీశ్ బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పచ్చడి మామిడికాయల కోసం వేరే గ్రామానికి వెళ్లి రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఒంట్లో కొంచెం నలతగా ఉందని చెప్పి నిద్రపోయాడు. గురువారం ఉదయం తండ్రి భీమయ్య వెళ్లి నిద్రలేపగా సతీశ్ విగతజీవిగా పడి ఉన్నాడు. బుధవారం రోజంతా ఎండలో తిరగడంతో వడదెబ్బ తగిలి ఉంటుందని లేదా తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10 మందికి కోరుట్ల కోర్టులో జరిమానా విధించారని ఎస్సై శ్వేత తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మంది ఇటీవల పట్టుబడగా.. గురువారం కోర్టులో హాజరుపరిచామని, 10 మందికి గాను రూ.13 వేలు జరిమానా విధించగా, వారు చెల్లించడంతో వదిలేశారని పేర్కొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌కు సీబీఆర్టీ పరీక్ష

జగిత్యాల: డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌కు కంప్యూటర్ బెస్ట్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) పద్ధతిలో శుక్రవారం కొండగట్టు జేఎన్‌టీయూలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, అభ్యర్థులు అరగంట ముందే సెంటర్‌కు హాజరు కావాలన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాల: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా శుక్రవారం జరుగనున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షతో పాటు ఈనెల 21, 22 తేదీల్లో జరుగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ లత తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సివిల్ ఇంజినీర్ పోస్టులకు కొండగట్టు జేఎన్‌టీయూ కళాశాలలో పరీక్ష జరుగుతుందని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 100 మంది, సివిల్ ఇంజినీర్ పోస్టులకు 100 మంది హాజరవుతారని తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ కేంద్రాలను మూసివేసి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, కాలుక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

రంగదాముని పల్లి వాసికి డాక్టరేట్



తిరుపతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రంగదామునిపల్లి గ్రామానికి చెందిన సామల తిరుపతి వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ సాధించాడు. ప్రొఫెసర్ విజయకుమార్ మనుపాటి పర్యవేక్షణలో మనుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్ మెయింటనెన్స్ ఫర్ స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ ప్రొడక్షన్ అంశంపై పరిశోధన పూర్తి చేశాడు. తిరుపతి సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ప్రొఫెసర్ జీఎస్.దంగాయజ్ మెకానికల్ విభాగం మాలవియ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జైపూర్ అతడికి పీహెచ్‌డీ పట్టా ప్రకటించింది. తిరుపతి తన పీహెచ్‌డీలో రూపొందించిన పలు పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. రంగదామునిపల్లిలోని సెకండరీ పాఠశాలలో పదో తరగతి, ఎస్వీ జూనియర్ కళాశాల జగిత్యాలలో ఇంటర్, కరీంనగర్ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి గేట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. ఎంటెక్, పీహెచ్‌డీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరంగల్‌లో పూర్తి చేశాడు. ఈ సందర్భంగా అతడిని తల్లిదండ్రులు, అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.



కుక్కపిల్లలకు బారసాల

జగిత్యాలరూరల్: పెంపుడు కుక్క పిల్లలకు ఓ యజమాని బారసాల ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన పోతు గంగు పెంపుడు కుక్క గత ఏప్రిల్ 28న 10 పిల్లలకు జన్మనిచ్చింది. గురువారం 21 రోజులు కావడంతో వాటికి కొత్త దుస్తులు తొడిగి, నామకరణం చేశారు. బంధువులకు విందు భోజనం పెట్టారు.

క్లుప్తంగా

బహిరంగ వేలం

కోరుట్ల టౌన్ : పట్టణ శివారు సంగెం రోడ్డు లోని సర్వేనెంబర్ 861, 867లో ప్రభుత్వ స్వాధీనంలోని 225 మామిడిచెట్లకు శుక్రవారం ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజేశ్ గురువారం పేర్కొన్నారు. ఆసక్తిగల వారు డీడీని తహసీల్దార్ పేరిట తీసి, అందజేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడికి రోడ్డు ప్రమాదంలో గాయపడగా బీఎస్పీ, అంబేద్కర్ సంఘం నాయకులు గురువారం రూ.14,400 ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జరి ప్రకాశ్, మండలాధ్యక్షుడు బొబ్బిలి కిశోర్, ఏవైఎస్ నాయకులు రాహుల్, వెంకటేశ్, తిరుమలేశ్, శ్రీధర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధిగా రవీందర్ రెడ్డి


రవీందర్ రెడ్డి

గొల్లపల్లి: బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధిగా వెన్గుమట్లకు చెందిన ఎల్లాల రవీందర్ రెడ్డిని నియామకమయ్యారు. వీరితో పాటు 20 మంది అడ్వైజరీ కమిటీ సభ్యులను నియమించారు. అడ్వైజరీ సభ్యులుగా క్యాతం రవీందర్ రెడ్డి, సురిగినేని కమలాకర్‌రావు, ముస్కు లింగారెడ్డి, ఎల్లాల నారాయణరెడ్డి, ముస్కు నారాయణరెడ్డి, పాదం రమేశ్, బుర్ర తిరుపతి, నవ్వ అంజన్న, మాదాసు తిరుపతి, ఎడ్మల మల్లారెడ్డి, బాలభక్తుల కిషన్, గుగ్గిళ్ల రాజమౌళి, చౌటపల్లి తిరుపతి, భాస్కర్ నాయక్, పుట్టపాక సత్యం, కనపర్తి దామోదర్ రావు, చిలుకమర్రి శ్రీనివాస్, చాడ సత్తన్న, పల్లెర్ల రంజిత్, సింగిరెడ్డి జలేందర్ రెడ్డిని నియమించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, టీపీసీసీ నాయకుడు నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు తప్ప పేరుతో కోత విధించడం సరికాదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ గౌడ్, నాయకులు ఎలేటి పుల్లారెడ్డి, హన్మక్క, వెంకటేశ్, శంకర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లిలో..

సారంగాపూర్ : తూకంలో కోత విధించకుండా కొనుగోళ్లు జరిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు, దంత వైద్యుడు ఎడమల శైలేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని రేచపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎండవేడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, తదితరులున్నారు.

క్రీడాప్రాంగణం పూర్తి చేయాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణాన్ని పూర్తిచేయాలని బీర్‌పూర్ గ్రామ వార్డు సభ్యుడు బైరవేని సత్యనారాయణ కోరారు. క్రీడాప్రాంగణం బోర్డును అధికారులు ఏర్పాటు చేసి వదిలేశారని, దీంతో నిరుపయోగంగా మారిందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లోని రైస్‌మిల్లును గురువారం తహసీల్దార్ ఖయ్యూం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగుమతి ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు.

గుంతలమయం

- మండలకేంద్రంలో అధ్వానంగా తయారైన రోడ్లపై పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు
- తొమ్మిదేళ్లుగా ఇబ్బందులు
- సీసీరోడ్డు నిర్మించాలని వేడుకోలు


మోడల్ స్కూల్‌కు వెళ్లే మట్టి రోడ్డు

కథలాపూర్: కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన జూనియర్ కళాశాల, పాఠశాలలకు మట్టిరోడ్డే దిక్కవుతోంది. గుంతలరోడ్డు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సిబ్బంది, విద్యార్థులు వాపోతున్నారు. మండలకేంద్రంలో గ్రామానికి కొంచెం దూరంగా పోలీస్‌స్టేషన్ వెనుకవైపు మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ, బాలికల విద్యాలయాల భవనాలను కోట్లాది రూపాయలతో నిర్మించారు. కానీ విద్యాలయాలకు వెళ్లేందుకు సీసీరోడ్డును వేయలేదు. సుమారు తొమ్మిదేళ్ల నుంచి పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, సిబ్బంది, వెయ్యి మంది విద్యార్థులు గుంతలమయమైన రోడ్డు, తుమ్మ చెట్ల మధ్యన నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు, రోడ్డుపక్కన ప్రత్యేక కాలువ నిర్మిస్తేనే శాశ్వత సమస్య పరిష్కారమవుతుందని వారు కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్డు..

కోరుట్ల–వేములవాడ డబుల్ రోడ్డు నుంచి కథలాపూర్‌లో సుమారు 500 మీటర్ల దూరంలో ఈ మూడు విద్యాలయాలను నిర్మించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే గుంతలమయమైన రోడ్డుగుండా వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, కేజీబీవీలకు వెళ్లేందుకు సీసీరోడ్డు వేయాలని, రోడ్డు పైకి వర్షపు నీరు రాకుండా మరమ్మతులు చేయించాలని సిబ్బంది, విద్యార్థులు కోరుతున్నారు.

కాలువ నిర్మించాలి



వర్షాకాలంలో మోడల్‌స్కూల్‌కు వెళ్లే రోడ్డు గుండా వరద పారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్య ఏళ్లుగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షం కురిస్తే మట్టిపోయించి చేతులు దులుపుకుంటున్నారు. సీసీరోడ్డు నిర్మాణం చేపట్టి వర్షపునీరు రోడ్డుపైకి రాకుండా కాలువ నిర్మించాలి

– ఆకుల సంతోష్, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం



మెయిన్ రోడ్డు నుంచి మోడల్‌స్కూల్ వరకు 350 మీటర్ల దూరం ఉంటుంది. సీసీరోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం. రోడ్డుపక్కన నుంచి వర్షపునీరు వెళ్లేలా కాలువలు నిర్మించాలి. దీనిపై ఇంతకుముందు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– ఆదిత్య, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, కథలాపూర్

బీరప్ప ఉత్సవాలు ప్రారంభం


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

పెగడపల్లి: మండలంలోని రాములపల్లిలో గొల్ల, కుర్మల ఆరాధ్య దైవమైన బీరప్ప ఉత్సవాలను శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయానికి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ తోట గంగాభవాని, కులసంఘాల అధ్యక్షులు దాసరి పోచయ్య, గుంటి బీరయ్య, ఉపసర్పంచ్ మెతుకు విష్ణువర్ధన్, ఉత్సవ కమిటీ సభ్యులు మల్లేశం, కొమురయ్య, రమేశ్, మహేశ్, శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు తోట శ్రీనివాస్, పాశం తిరుపతి, బర్ల మల్లేశ్, తోట మహేందర్, కట్ల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల వైద్యుడిని నియమిస్తాం

సాక్షి స్పందన

రాయికల్ : రాయికల్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో మరో రెండుమూడు రోజుల్లో పీడియాట్రిషీయన్‌ను నియమిస్తామని వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ సుదక్షిణదేవి అన్నారు. గురువారం సాక్షి దినపత్రికలో 'పిల్లల ఆరోగ్యానికి రక్షణేది' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ సుదక్షిణదేవి స్పందించారు. గతంలో పనిచేసిన హర్షిత సెలవులో వెళ్లడానికి గల కారణాలను సూపరింటెండెంట్ రవిని అడిగి తెలుసుకున్నారు. 2–3 రోజుల్లో కోరుట్ల, మెట్‌పల్లికి చెందిన పిడియాట్రిషీయన్‌ను రాయికల్‌కు డిప్యూటేషన్ చేయనున్నట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రామాజీపేటలో పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికికాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, ఉపసర్పంచ్ హరీశ్‌రావు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో బంద్


వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు

మల్లాపూర్ : జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన మల్లాపూర్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. కిరాణ దుకాణాలు, హోటళ్లు, పలు వాణిజ్య దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సై అనిల్‌పై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి విచారణ జరుపకుండానే పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం తగదన్నారు. ఎస్సై నవీన్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

తహసీల్దార్‌కు వినతి..

ఎస్సై అనిల్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేశ్, భజరంగ్ దళ్ మండల కన్వీనర్ బండి జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి చేసుకున్న యువతిపై దాడికి యత్నం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన యువకుడిని ఆదర్శ వివాహం చేసుకుంది. కాగా ఈనెల 12న గుట్టుచప్పుడు కాకుండా గ్రామానికి వచ్చింది. గురువారం ఉదయం జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మ్యారేజ్ చేసుకునేందుకు యువతీ, యువకుడు రావడంతో విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం బయట యువతిపై దాడి చేసి తీసుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. కాగా, జగిత్యాల డీఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సమాచారం.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి


బాధితులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం(ధర్మపురి): అగ్ని ప్రమాదంలో ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన అన్నదమ్ములు పెసరి అశోక్, పెసరి పాండు ఇంట్లో బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి నష్టం వాటిల్లింది. గురువారం బాధిత కుటుంబాలను లక్ష్మణ్‌కుమార్ పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో నష్టం వాటిల్లిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండు చేశారు. షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఇళ్లను పరిశీలించేందుకు సంబంధిత అధికారులు ఇంతవరకు రాలేదని, దీనికి బాధ్యులెవరని ప్రశ్నించాడు. బాధిత కటుంబాలను లక్ష్మణ్‌కుమార్ తన వంతు సాయంగా రూ.6వేలు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు తదితరులున్నారు.

'బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి'


మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్లటౌన్: సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ. 2,016 ఇవ్వాలని బీడీ కార్మిక సంఘం ఏ ఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీడీ కా ర్మికుల సమావేశం సి.ప్రభాకర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీడీ కార్మికులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి సంక్షేమ పథకాలు పక్కగా అమలు చేయాలన్నారు. అనంతరం ప్రభాకర్ భవన్ నుంచి బీడీ కార్మికులు కోరుట్ల ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కా ర్యక్రమంలో రాష్ట్ర నాయకుడు చెన్న విశ్వా థం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రా ,ధ, కొ క్కుల శాంత, సాంబార్ మహేష్, అందె రమేష్, మ్యాదరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం బలోపేతానికి కృషి


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): పద్మశాలీ సంఘం బలోపేతానికి సభ్యులందరం కలిసి కృషి చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మేడిపెల్లి మండలకేంద్రంలో రాష్ట్ర పద్మశాలీ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సంఘం సభ్యులతో సభ్యత్వం త్వరగా చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం వినోద, సర్పంచులు అభిలాశ్, వంగ వెంకటేశం, సంఘం మండలాధ్యక్షుడు రవి, నాయకులు అంకం సాగర్, సత్యనారాయణ, సతీశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

మల్యాల : నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన 38 మందికి రూ.38,4,408 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే రవిశంకర్, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, ఎంపీపీ మెన్నేని స్వర్ణలత పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, ఎంపీపీ మెన్నేని స్వర్ణలత, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి


ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

కోరుట్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని కళాశాల అధ్యాపకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో వసతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కళాశాలల బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జిందం రాజేష సంతోష్, శ్రీనివాస్, వంశీకృష్ణ, ప్రశాంత్, సాయికృష్ణా, శిరీష్, సుబ్రహ్మణ్యం రా జు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని స్వర్ణకార సంఘం భవనంలో బుధవారం రాత్రి సిల్వర్, జ్యూవెల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఇల్లెందుల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా సుంకం మహేశ్, ప్రధాన కార్యదర్శిగా తాదూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మల్యాల శేఖర్, కోశాధికారిగా తునికి ఆనంద్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కల్వకుంట్ల సంజయ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుట్టలు తవ్వుతూ.. పంటలు సాగుచేస్తూ


చదును చేసిన స్థలం


మట్టిని తవ్వుతున్న జేసీబీ

జగిత్యాల రూరల్: మండలంలోని కల్లెడ గ్రామ శివారులో ఉన్న గుట్టలను కొంతమంది జేసీబీ యజమానులు పెద్ద ఎత్తున మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలో సోమన్‌పల్లి రోడ్డులోని గుట్టలతో పాటు యశ్వంతరావుపేట రోడ్డులోని గుట్టల వద్ద ట్రాక్టర్లు, టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. మట్టి తవ్విన ప్రాంతాల్లో కొందరు చదును చేస్తూ పంట సాగు చేసుకొని కబ్జా చేస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు గుట్టను తవ్వుతూ పంటలు సాగు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కల్లెడ గ్రామ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. కొన్నిరోజులుగా నిఘా పెంచాం. అనుమతి లేకుండా ఎవరూ ప్రభుత్వ భూముల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తే వాహనాలతో పాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

– నవీన్, తహసీల్దార్, జగిత్యాల రూరల్

యువత ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి


విద్యార్థినిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేత గోలి మోహన్

కథలాపూర్ : యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆధ్య గోలి ఫౌండేషన్ చైర్మన్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత గోలి మోహన్ పేర్కొన్నారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్ సాధించిన మండలంలోని పోతారం గ్రామానికి చెందిన భార్గవిని సన్మానించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలను డిజిటలైజేషన్ చేసేందుకు ప్ర ణాళిక తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ జలేందర్, నాయకులు పాల్గొన్నారు.